

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు తన 36వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా యుటిఎఫ్ హోంలో పదవ తరగతి వివిధ సబ్జెక్టుల్లో అవగాహన పొందుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు, స్కేలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక స్పృహతో ప్రసాదరావు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఒక నెల జీతం సమాజ సేవకు ఖర్చు పెడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నగర అధ్యక్షుడు వరహాలబాబు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై చిన్నచూపు

- సెలవులకు నోచుకోని అంగన్‌వాడీ పిల్లలు
- ఎండవేడిమికి విలవిల్లాడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకే ఎండవేడిమి నుంచి ఉపశమనం ఉండాలంటే రెండు నెలల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కార్పొరేట్ స్కూళ్ల సంగతి ఎలా ఉన్నప్పటికీ ప్రభుత్వ బడులన్నీ మూతేశారు. చివరకు కోర్టులకు సైతం వేసవి సెలవులు వర్తిస్తున్నాయి. కానీ చిన్నారులకు నిర్వహించే అంగన్‌వాడీ బడులకు మాత్రం సెలవులు లేకుండా చేసిన తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఎండవేడిమి పెరుగుతున్న వేళ అంగన్‌వాడీ కేంద్రాలు తెరవాల్సిందేనని అధికారులు ఆదేశాలివ్వడం విమర్శలకు తావిస్తోంది. చిన్నపిల్లలు వడదెబ్బకు గురయితే బాధ్యత ఎవరిదనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సొంత భవనాలుండగా మిగిలిన అద్దె భవనల్లో కొనసాగుతున్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు ఉన్నారు. 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భిణులు ఉన్నారు. అయితే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పుడు ఎండల తీవ్రతతో తల్లడిల్లిపోతున్నాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సెలవులు వర్తింపజేసిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మాత్రం విస్మరించింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నపిల్లలు వడదెబ్బకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

సౌకర్యాల లేమితో అవస్థలు

సెలవులు ప్రకటించనందున ప్రస్తుతం చిన్నారులు ఎండల తాకిడికి విలవిల్లాడుతున్నారు. మరోపక్క కేంద్రాల్లో కనీస సౌకర్యాల లేమితో నిర్వాహకులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రతీ నెల కనీసం 25 రోజుల పాటు పౌష్టికాహారం అందించాలనే నిబంధనను ఐసిడిఎస్ అధికారులు రూపొందించారు. ప్రస్తుతం దానిని సాకుగా చూపించి సెలవులు ప్రకటించడానికి వెనకాడడంతో అంగన్‌వాడీ కేంద్రాలు అవస్థల మధ్య నడపాల్సి వస్తోంది. ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా ఏం జరుగుతుందోనని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రం మూసివేసిన తర్వాత పిల్లలు ఇంటికి తీసుకెళ్ళే సమయంలో ఎండ వేడికి గురయితే ఎవరు బాధ్యత వహిస్తారన్నది సమాధానం లేని ప్రశ్నగా మారుతోంది.

ప్రత్యామ్నాయాలున్నా...

స్త్రీ, శిశు సంక్షేమంలో భాగంగా పౌష్టికాహారం అందించడానికి అనేక మార్గాలున్నాయి. ప్రత్యామ్నాయంగా ప్రతి ఏటా సెలవులకు ముందే తగిన ఆహారాన్ని ఆయా లబ్దిదారులకు అందించడం ఆనవాయితీగా ఉంది. తద్వారా పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి ఆటంకం రాకుండా చూసే మార్గం ఉంది. అయినా అధికారులు దానిని పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఉన్న 1986 కేంద్రాల్లో 706 సొంత కేంద్రాలు ఉండగా 1107 అద్దె భవనాల్లో, రెంట్ ఫ్రీలో 173 నడుస్తున్నాయి. 50 శాతం మాత్రమే సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన 50 శాతం అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో, అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. అలాంటి కేంద్రాలను ప్రస్తుతం వేసవిలో నిర్వహించాల్సిందేనంటూ అధికారులు తీసుకున్న నిర్ణయం క్షేత్రస్థాయి సిబ్బందిని చిక్కుల్లో నెడుతోంది.

ఇబ్బందులు తప్పడం లేదు



ఎండ తీవ్రత మూలంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పెను భారంగా మారింది. పిల్లల రక్షణ విషయం పెద్ద సమస్యగా మారుతోంది. చిన్నపిల్లలు, గర్భిణులు ఎండలో బయటకు రాకూడదని వైద్యులు సలహాలిస్తుంటే, ఎండల వేళ కేంద్రాలు నిర్వహించాల్సిందేనని ఐసిడిఎస్ అధికారులు ఆదేశాలివ్వడం విచిత్రంగా కనిపిస్తోంది.

-ఇ.చంద్రావతి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి.

తల్లిదండ్రుల్లో ఆందోళన



అంగన్‌వాడీ కేంద్రాలను వేసవిలో నిర్వహించడం పెను సవాలుగా మారింది. మండు వేసవిలో పిల్లల్ని పంపడానికి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం నుంచి తిరిగి వచ్చే వరకూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి వేసవి సెలవులు ఇవ్వాలి.

-పాటి దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్త, కొండప్ప వీధి, పిఠాపురం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ, కోటనందూరు

మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు ట్రాన్స్‌పోర్ట్ సంఘాలు సిద్ధంగా ఉన్నాయని నేతలు ప్రకటించారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిఐటియు, ట్రాన్స్‌పోర్ట్ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహన సవరణ చట్టం, గత సంవత్సరం పార్లమెంటులో ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో కొన్ని సెక్షన్లు డ్రైవర్ల జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో ఉన్న డ్రైవర్లకు ప్రమాదం జరిగితే వారి కుటుంబ సభ్యులకు ఆదుకోవడానికి ప్రభుత్వం కనీసమైన సంక్షేమ పథకం ఏర్పాటు చేయడం లేదన్నారు. తాజాగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్, బేరసారాల హక్కు, ఉద్యమించే హక్కు కాలరాస్తున్నాయని అన్నారు. మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు పిలుపు ఇస్తోందన్నారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్స్ నాయకులు నురుకుర్తి ప్రకాశరావు, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎలిసే శ్రీనివాస్, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు వాలిశెట్టి శ్రీనివాస్, మినీ గూడ్స్ వ్యాన్ నాయకులు బి.రామ తదితరులు మాట్లాడుతూ ఫిట్‌నెస్ కోసం పలుమార్లు చలానాలు తీయాల్సి వస్తుందన్నారు. గ్రీన్ ట్యాక్స్ పేరుతో వేలాది రూపాయలు చెల్లించాల్సి వస్తోందన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, స్పేర్ పార్ట్ ధరలతో నిరంతరం ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు సతమతమవుతున్నారని తెలిపారు. ప్రయివేటు ఫైనాన్స్ సంస్థల ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె అనంతరం దశలవారీగా ఆందోళన చేపట్టాలని తీర్మానించారు. మే 20న వాహనాలు నిలుపుదల చేసి కాకినాడ మెయిన్ రోడ్ హెడ్ పోస్టాఫీసు నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు పాల్గొనాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పలివెల వీరబాబు, కె.సత్తిబాబు, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, ట్రాన్స్‌పోర్ట్ సంఘాల నాయకులు నక్కా కృష్ణ, డి.దుర్గారావు, సిహెచ్.రాంబాబు, ముత్యాలు, పి.సత్యనారాయణ, ఎ.శ్రీను, మట్ట చిన్ని, దుర్గాప్రసాద్, చంద్రరావు, తిరుపతిరెడ్డి, గణేష్, దొరబాబు, స్వామి, వెంకట్ పాల్గొన్నారు. అలాగే కోటనందూరులో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ఆర్.పద్మ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల హక్కులను, చట్టాలను కాపాడుకోవడానికి, ప్రభుత్వం నిత్యవసర ధరల పెరుగుదలను, కరెంటు, పెట్రోల్, గ్యాస్, ధరలు పెరుగుదలను నిరసిస్తూ ఈ సమ్మె జరుగుతుందని తెలిపారు. ఈ సమ్మెలో కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం స్థానిక తహశీల్దార్ టి.సుభాష్, ఎంఇఒ ఎ.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎస్. జైరామ్‌కు సమ్మె నోటీసును అందజేశారు.



తహశీల్దార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న పద్మ

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిప్పరాజుపాలెం, తర్లంపూడి, పెనుమల్ల, జగన్నాథగిరి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని, కొంతమంది మిల్లర్స్ ప్రయివేటు వ్యక్తుల ద్వారా తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. రైతులు పెట్టిన పెట్టుబడికి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు పొంతన లేదన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద కాటా, జట్టు కూలీలు లేకపోవడంతో ఈ మినహాయింపులు ఉంటున్నాయని అన్నారు. ఆర్ఎస్‌కెల వద్ద కాటాతోపాటు, జట్టు కూలీలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దవులూరి సురేష్, సిల్క్ సుబ్రహ్మణ్యం, బిల్లా అప్పారావు, పాటినీడి భద్రరావు, జక్కపు మణికంఠ, గుత్తుల బులి వెంకన్న, వనం శ్రీను, జక్కపు బాబ్జి పాల్గొన్నారు.



ధాన్యాన్ని చూపుతున్న రాజబాబు, రైతులు

చేనేతను ప్రోత్సహించేలా చర్యలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ చేనేతను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీరాజ్ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ రాష్ట్ర సమన్వయకర్త వినోద్ అన్నారు. మంగళవారం ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతపై ఏర్పడిన కార్మికుల జీవన విధానాన్ని పెంపొందించుకోవాలంటే ఎటువంటి సహకారం అవసరమని కోరారు. దీనిపై పలువురు చేనేత కార్మికులు మాట్లాడుతూ సిల్క్ తయారీ కేంద్రాన్ని, చీరల డిజైనింగ్, దయ్యింగ్(రంగులు), కేంద్రాలను ఏర్పాటు చేయాలని, చీరలు పడుగు సాపేందుకు షెడ్లు నిర్మాణం చేయాలని కోరారు. చేనేతపై జిఎస్‌టిని తొలగించాలని సూచించారు. ప్రస్తుతం ఉప్పాడ చీరలు కొనుగోలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాద్ చేనేత కార్మికులకు చేనేత యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు రూ.ఐదు కోట్లు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవిశంకర్, ఇఒపిఆర్‌డి క్రరి హరికృష్ణ సత్యరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, జనసేన నాయకులు ఉమ్మిడి జాను, తదితరులు పాల్గొన్నారు



ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీదేవికి డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి



సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మసి కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శ్రీదేవికి డాక్టరేట్ సాధించారని ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ వచ్చిందన్నారు. డాక్టర్ ఎస్.సెల్వముత్తుకుమార్ నేతృత్వంలో శ్రీదేవి సమర్పించిన 'డిజైన్ ఇన్ విట్రో అండ్ స్టాటిస్టికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సాలిడ్ సెల్ఫ్ నానో ఎమెల్సీఫయింగ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ కంటైనింగ్ అంటిహైపెర్లిపిడెమిక్ డ్రగ్స్' అనే అంశంపై థీసిస్ సమర్పించినట్లు తెలిపారు. డాక్టర్ జి.శ్రీదేవి తన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రో.ఛాన్సలర్. డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్. డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫార్మసి కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు..

నేటి నుంచి వేసవి శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు పిసిసి గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించే ఈ శిబిరంలో బాల బాలికలకు ఉదయం కరాటే, సాయంత్రం మ్యాథ్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్, కర్ర సాము, మ్యాజిక్స్, సైన్సు ప్రయోగాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బకాయి జీతాలు ఇప్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్‌కు చెల్లించాల్సిన రెండు నెలల జీతాల బకాయిలను తక్షణమే ఇప్పించాలని సిఐటియు నాయకులు కోరారు. మంగళవారం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర నాయకులు పలివెల వీరబాబు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయకుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో 20వ తేదీ దాటిన తర్వాతనే జీతాలు చెల్లించడం పరిపాటిగా మారిపోయిందన్నారు. 2024 మే నెలలో కాంట్రాక్ట్ గడువు ముగిసినా జీతాలు పెంచకుండా పాత కాంట్రాక్ట్‌నే కొనసాగిస్తూ వస్తున్నారని తెలిపారు. సకాలంలో జీతాలు చెల్లించక పోవడం వల్ల కార్మికులు అప్పుల పాలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సూపరిండెంట్ జోక్యం చేసుకుని బకాయి ఉన్న రెండు నెలల జీతాలు తక్షణమే కార్మికుల ఖాతాలకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.శేషు, జె.లక్ష్మీప్రియ, ఆర్.రమేష్, ఎస్.వాసు, బి.శ్రీకాంత్, కృష్ణవేణి, సిహెచ్.పుష్ప, ఎం.కుమారి, రమణమ్మ, ముత్యాల రవి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేయాలి

ప్రజాశక్తి - తుని

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డ్రైవర్స్ కాలనీలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించవద్దు, యాక్సిస్ ఒప్పందం రద్దు చేయాలి' అంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ విద్యుత్‌ను రూ.4.60కి కొనుగోలు చేసేలా యాక్సిస్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్లపాటు రూ.15 వేల కోట్ల భారం పడుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అదాని సంస్థలో సెకి ఒప్పందం.ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.49కి ఒప్పందం చేసుకుంటే వ్యతిరేకంచిన చంద్రబాబు నేడు ఈ ఒప్పందాన్ని ఎలా చేసుకున్నారని ప్రశ్నించారు. యాక్సిస్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయకపోతే ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, శశికళ. శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్‌మీటర్లు వద్దంటూ ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం


ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తుందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు జమ్మలమడక నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. స్కీముల ముసుగులో స్కాములు చేస్తూ కూటమి పార్టీల నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక, మట్టి లిక్కర్ మాఫియా, రాజధాని నిర్మాణం పేరుతో ప్రజాధనాన్ని దోచుకోంటున్నారని అన్నారు. లంచాలు తీసుకుంటూ అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి చంద్రబాబు ప్రజలకు షాక్ ఇచ్చారన్నారు.

ప్రసవాలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాలను ప్రోత్సహించాలని స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సునీత మెర్సి కోరారు. మంగళవారం పిహెచ్‌సిలో ఆశ, డే స్టాప్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రసవాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కేన్సర్ సర్వే, గర్భిణులు, బాలింత ఆరోగ్యం, మాతా శిశు సంక్షేమంతోపాటు, డెంగీ, మలేరియా వంటి ఇతర వైరల్ జ్వరాలు వ్యాపించకుండా ఇంటింటా సర్వే చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు అహ్మద్ బాషా, రజిఎమ్ భీమ్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



కులగణనతో ఎవరికి లాభం?

13న రెవెన్యూ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 13న మండల రెవెన్యూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13పీ కార్యాలయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అన్ని పనులను పూర్తి చేస్తూ వస్తున్నామన్నారు. డ్రెయినేజీల ఆధునీకరణ, గడియార స్తంభం పనులు వంటివాటిని పూర్తిచేయడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధిని చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే పెద్దాపురంలో ఇండస్ట్రీయల్ పార్కును రెవెన్యూ మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఏడాది పాలనలోనే నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, టిడిపి మండల అధ్యక్షులు అడబాల కుమారస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, నాయకులు కంటే జగదీష్‌మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, బలుసు వాసు, నూనె రామారావు తాతపూడి కృష్ణబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్లో మండల, గ్రామ స్థాయి అధికారులకు స్వర్ణ ఆంధ్ర-2047 విజన్ ప్లాన్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా జగ్గంపేట నియోజకవర్గాన్ని స్వర్ణ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలంటే అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అధికారులు విధులను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎన్‌వి.సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకట లక్ష్మి, సిపిఒ త్రినాథ్, డిహెచ్ఒ ఎన్.మల్లిఖార్జునరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సరిత, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని పరిశీలించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి - కరప

మండలంలోని నడకుదురు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని మంగళవారం ఆర్‌జెడి నాగమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం కల్గిన ఉపాధ్యాయులతో విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. ఆటపాటలు, వ్యాయామం, డ్రాయింగ్, సైన్స్ ప్రదర్శనలతో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దబడతారని తల్లితండ్రులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ అవార్డు గ్రహీత పిల్లి గోవిందరాజులు పెప్పెట్ ప్రదర్శన చేసి తల్లితండ్రులను అలరించారు. ఈనీ కార్యక్రమంలో ఎంఇఒ పి.సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈ.సెట్ పరీక్ష

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎపి ఈసెట్-2025 ఆన్ లైన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ముగిసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక శివారు వీధి వారి లంకలో మంగళవారం గోదావరి నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేటకు చెందిన దాసరి సాయిరాం(28), మెండెం రాంబాబు(30) వీధి వారి లంకలో ధనమ్మతల్లిని దర్శించుకునేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వచ్చారు. అనంతరం వీధి వారి లంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మండపేట రూరల్ సిఐ పెద్దిరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయిరాం, రాంబాబు మృతదేహాలను వెలికి తీశారు. విఆర్ఒ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. వీరిలో సాయిరామ్‌కు వివాహం అయ్యింది.


దాసరి సాయిరామ్(ఫైల్)


మెండెం రాంబాబు(ఫైల్)

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి గ్రామ శివారున పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన చింత శ్రీను 60 లీటర్ల నాటు సారాను తరలిస్తూ పట్టు పడ్డాడు. అతని నుంచి సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి తుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-గోపాలపురం

అత్యాచార యత్నం కేసులో వ్యక్తికి రిమాండ్ విధించారని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేష్ ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 12.30 గం.ల సమయంలో అదే గ్రామంలో ఉన్న ఒక వివాహితపై అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు వెంకటేష్‌ను అరెస్టు చేసి కొవ్వూరు కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిందితునికి 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.


నాగరాజును అభినందిస్తున్న ఎంఎల్ఎ నానాజీ

అథ్లెటిక్ నాగబాబును అభినందించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కరప

కర్ణాటక రాష్ట్రంలో జాతీయస్థాయిలో జరిగిన 44వ నేషనల్ వెటరన్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పరుగు పోటీల్లో పాల్గొన్న యాతం నాగబాబు 100, 400, 800 మీటర్ల పరుగు పోటీలలో తృతీయ స్థానంలో గెలుపొంది పథకాలు సాధించారు. ప్రస్తుతం నాగబాబు కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరప సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్నారు. మంగళవారం వేలంగి, కరప సబ్ సెంటర్ల హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నాగబాబును ఘనంగా సత్కరించారు. రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ అభినందించారు. మరిన్ని పథకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.


చెక్కును అందిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను సంబంధిత బాధితులకు మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ అందజేశారు. కొమరగిరి పంచాయతీకి చెందిన పరిధిలో ఉన్న కొప్పిశెట్టి సూర్యచంద్రప్రకాష్‌రావుకి రూ.2.29 లక్షలు, కొమ్మూరి వీరవాణికి రూ.45 వేలు, తాడి మంగకు రూ.25 వేలు, శివకోటి శాంతికుమారికి రూ.73 వేలు సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదల అయినట్లు వర్మ తెలి పారు. వీరిలో ఇద్దరు ఇప్పటికే మరణించగా వారి కుటుంబ సభ్యులకు చెక్కులను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అనిశెట్టి సత్యా నందరెడ్డి, మాజీ జడ్‌పిటిసి బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఉమాదేవి

కిశోర వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మర్లావ, పాత పెద్దాపురం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మర్లావ సదస్సులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యు.ఉమాదేవి పాల్గొని కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులలో ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, కాకినాడ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కోరారు. మంగళవారం పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపిడిఒ ఎంఎఆర్.కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కావున కార్మికులంతా 20న జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు లోవరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆశ వర్కర్ల ఒప్పంద జీవోలు తక్షణమే విడుదల చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం డిఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్‌కు యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లందరూ ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. ఆశా వర్కర్లకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, ఒప్పంద జీఒలు వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈ నెలలో మొదటి మంగళవారం జరిగే ఆషా డే లో నుంచి నల్ల రిబ్బన్లతో నిరసన తెలపడం జరిగిందన్నారు. నేటి నుంచి ఒప్పంద జీఒలు విడుదల అయ్యేంత వరకూ ఆశా వర్కర్లు నిరసన తెలియజేస్తూ వర్క్‌లో ఉంటామని తెలిపారు. దేశ వ్యాప్తంగా కార్మికులకు నష్టం జరిగే విధంగా మార్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఈ నెల 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ఆశలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెక్కల వేణి, మలక నాగలక్ష్మి, ఎస్.లక్ష్మి, సుజాత, గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.


డిఎంహెచ్ఓకి వినతిపత్రం ఇస్తున్న ఆశ నాయకత్వం

సత్యదేవుని ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - శంకవరం

అన్నవరం సత్యదేవుని కల్యాణోత్సవాల ఏర్పాట్లను డిఎస్‌పి హరినాథ్‌రాజు దేవస్థానం అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళవారం కొండపైకి వచ్చిన డిఎస్‌పి దేవస్థానం ఇఒ సుబ్బారావు సమక్షంలో సెక్యూరిటీ అంశాలపై ఆరా తీశారు. 8వ తేదీ రాత్రి జరిగే స్వామి కల్యాణోత్సవం వేదిక పరిసరాలను క్షణ్ణంగా పరిశీలించారు. వేదిక వద్ద విఐపిలు, సామాన్య భక్తులు కూర్చునే ప్రదేశాలను పరిశీలించి ఇఒ సుబ్బారావుకు కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు ఎదురవకుండా 200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సిఐ బి.సూరి అప్పారావు, ఎస్ఐ హరిబాబు, దేవస్థాన అధికారులు కృష్ణారావు, కొండలరావు, వి.రామకృష్ణ, బిఎస్.రాంబాబు పాల్గొన్నారు


ఏర్పాట్లును పరిశీలిస్తున్న డిఎస్‌పి హరినాథ్‌రాజు

మట్టి తవ్వకాలపై నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలకు నిరసనగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ ప్రజలు ధర్నా చేశారు. తొలుత ఎల్ఐసి కార్యాలయం నుంచి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని చెరువుల్లో ఉపాధి పనులు ప్రారంభం అయ్యాయని, కొంతమంది చెరువులను లోతుగా తవ్వేసి మట్టిన అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి దీనిపై విచారణ జరిపి అక్రమ మట్టి తవ్వకాలు నిరోధించడంతో పాటు, అక్రమ తవ్వకం దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు, 'మనం – మన ఊరు' కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నానుబోయిన కళ్యాణ్‌కుమార్, పోతాబత్తుల నగేష్, కమిటీ సభ్యులు మోటూరు వీరబాబు, రేగులబంధ మంగరాజు, బోసుబాబు, మాజీ జడ్‌పిటిసి బంగారు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రాగంపేట గ్రామస్తులు

సాంకేతిక లోపంతోనే సర్వే నెంబర్లు మార్పు

ప్రజాశక్తి - కాజులూరు

సాంకేతిక లోపంతోనే సర్వే నెంబర్లు మార్పు జరిగిందని దేవాదాయ శాఖ అధికారి ఇవి.సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని శీల, కాజులూరు, కోలంక గ్రామాల్లోని దేవస్థానం, యండమూరి సత్రం భూములకు సంబంధించి సర్వే నెంబర్లలో లోపాలు గుర్తించడం జరిగిందని, దీనిని సరి చేసేందుకు డిప్యూటీ కలెక్టర్ భారతితో కలిసి దేవస్థానం భూములు, ప్రయివేటు భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సర్వేయర్ శివకుమార్, దేవాదాయ శాఖ డిటి సుబ్బారావు, ఎఒలు కృష్ణారెడ్డి, సోమరాజు, వేణుగోపాల్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పేరుతో దోపిడీ

ప్రజాశక్తి - సామర్లకోట

మహిళలకు కుట్టు మిషన్లు, కుట్టు శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుందని వైసిపి అయ్యరక విభాగం రాష్ట్ర అధ్యక్షులు, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ఆరోపించారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడారు. బిసి కార్పోరేషన్ నిధులతో కుట్టు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. బిసిలకు దక్కాల్సిన నిధులను దోపిడీ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని విమర్శించారు. బిసిలపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా అమరావతి రాజధాని పేరిట సరికొత్త డ్రామాలు ఆడుతుందని దుయ్యబట్టారు. కుట్టు శిక్షణపై పూర్తి స్థాయిలో విచారణ చేసి ప్రజాధనానికి రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు ఊబా జాన్ మోజెస్, నేక్కంటి సాయిప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు పాగా సురేష్‌కుమార్, పట్టణ మహిళ అధ్యక్షురాలు పాలికి కుసుమ, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, విడదాసరి రాజా, కట్టా రాజబాబు, పురం దాసు సలీం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అకడమిక్ లీడర్‌షిప్‌పై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో చెన్నైకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు 5 రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో మార్పులకు నాయకత్వం వహించగల నైపుణ్యాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. విద్యా రంగ నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి, పాలనలో పారదర్శకత, వ్యూహాత్మక ప్రణాళికలు ద్వారా సంస్థల అభివృద్ధి బోధనలో నూతన ఆవిష్కరణలు, నాణ్యత నియంత్రణ పద్ధతులపై విభిన్న రంగాలకు చెందిన నిపుణులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నై ప్రతినిధులు ప్రో.ఎస్.రేణుకదేవి, ప్రో.పి.మెల్లిగ, ఇంజనీర్ ఎం.సుతార్ సన్, యూనివర్శిటీ ప్రో.వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, ఐ క్యూ ఎసి డీన్ డాక్టర్ జి.రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఆర్‌డిఎ సిబ్బంది ఎం.సత్యబాల పాల్గొని పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మేథాశక్తి పెంచే రకరకాల ఆటలు ఆడించి విద్యార్థుల సృజనాత్మక నైపుణ్యతను పెంచేవిధంగా శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ ఇంగ్లీష్ గ్రామర్, స్టూడెంట్ హ్యాండ్ రైటింగ్ కోర్స్‌పై శిక్షణ ఇచ్చారు. కథలు, పద్యాలు, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి విఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎస్.రాజు, ఎవిఎస్.నాగేంద్రకుమార్, టి.వీర్రాజు, వి.అరుణ, కె.ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని సిఐటియు మండల అధ్యక్షులు కాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు తహాశీల్దార్ జి.చిన్నారావు, ఎస్ఐ వెంకటేష్‌లకు వినతిపత్రాలను అందజేశారు. ఈనెల 20 తేదిన జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కెవివి.సత్య నారాయణ, సిహెచ్.సాంబశివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్‌లో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు క్రాఫ్ట్ అంశాలపై అవగాహన కల్పించారు. కోటపాడు హైస్కూల్ హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవటం, కథలు చెప్పటంపై అవగాహన కల్పించారు.

విజ్ఞానదాయకంగా వేసవి శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల భవనంలో జరుగుతున్న వేసవి శిబిరం విజ్ఞానదాయకంగా సాగింది. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు, స్పోకెన్ ఇంగ్లీష్ స్పోకెన్, వర్డ్ గేమింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఆటలు, పాటలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాశి రవీంద్ర, బుద్ధరాజు జగన్నాథరాజు, చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పిల వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి - కాజులూరు

వైద్య సిబ్బందిపై ఎంఎల్‌హెచ్‌పిల వ్యాఖ్యలు సరికాదని గొల్లపాలెం సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మంగళవారం గొల్లపాలెం పిహెచ్‌సి సిబ్బందిపై ఎంఎల్‌హెచ్‌పిలు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పిహెచ్‌సి వైద్యాధికారిని సౌజన్య, శ్రేయలకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలోఎంపిహెచ్ఎ వైకుంఠరావు, హెల్త్ అసిస్టెంట్ శామ్యూల్‌రాజు, రాజారావు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డివైఇఒ వెంకటేశ్వరరావు

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డివైఇఒ నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెయిల్ అయిన విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యేలా శ్రద్ధ వహించాలన్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకూ తరగతులు నిర్వహించాలని ఆదేశించార. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వై.శివరామ కృష్ణయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు యు సత్యనారా యణ, యు.మీనామాధురి, ప్రసూన, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం, పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ విఆర్‌కె.చౌదరి తెలిపారు. మంగళవారం స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే 10 తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యే విధంగా క్లాసులు నిర్వహించాలన్నారు.

కరపలో డిఎల్‌పిఒ పర్యటన

ప్రజాశక్తి - కరప

మండలంలో కొంగోడు, సిరిపురం గ్రామాల్లో డిఎల్‌పిఒ అన్నామణి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాల పనితీరుపైనా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరుగతున్న పారిశుధ్య పనుల తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు, సర్పంచులు నక్కా బాబులు, సుజాత, కార్యదర్శులు వీరభద్రరావు, దుర్గ భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజులో 40 శాతం రాయితీ

ప్రజాశక్తి - యానాం

పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ఇంటర్ చదివే విద్యార్థులకు ఫీజులో 40 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.మార్తాండప్రసాద్ మంగళవారం తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో 580 మార్కులు దాటిన ఆయా విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించినట్టు తెలిపారు. మెరిట్ విద్యార్థులను ప్రోత్సాహించాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆయా విద్యార్థులు తనను సంప్రదించాలని సూచించారు.

రీజెన్సీ విద్యార్థి లోకేష్‌కు అభినందన

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన యానాంకు చెందిన భవిరిశెట్టి లోకేష్ సెకండ్ ఎంపిసిలో 957 మార్కులు సాధించాడు. ఈ మేరకు కళాశాలలో లోకేష్‌తోపాటు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ పి.మార్తాండ ప్రసాద్, అధ్యాపకులు భీమారావు శాలువాతో సత్కరించి అభినందించారు.


లోకేష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్